సాక్షి
జనగామ

I

శుక్రవారం । 24 । నవంబర్ । 2023





II

సాక్షి
జనగామ

శుక్రవారం | 24 | నవంబర్ | 2023



తల్లీ.. సల్లంగ చూడు

కార్తీక మాసం సందర్భంగా కాళేశ్వరంలోని గోదావరి నదికి ఘనంగా హారతి ఇచ్చారు. సల్లంగ చూడు తల్లీ అని వేడుకున్నారు.

- 9లో ▸



అకాల వర్షం.. ఆగమాగం

అకాల వర్షం రైతులను ఆగమాగం చేసింది. గురువారం కురిసిన వర్షానికి కేసముద్రం మార్కెట్‌లో ధాన్యం తడిసింది.

- 9లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
28°/22°

వాతావరణం

ఉదయం తేమతోకూడిన చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం అధికశాతం మేఘావృతమై అక్కడక్కడా జల్లులు కురుస్తాయి. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. చలి పెరుగుతుంది.

న్యూస్‌రీల్

రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపిక



అజయ్‌కుమార్

చిల్పూరు: చిన్నపెండ్యాల జిల్లా పరిషత్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న అజయ్‌కుమార్ రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం సంపత్, పీఈటీ వంశీకృష్ణ తెలిపారు. బుధవారం ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి స్విమ్మింగ్ పోటీలు హన్మకొండ బాలసముద్రంలోని స్విమ్మింగ్ పూల్ కాంప్లెక్స్‌లో జరిగాయి. ఇందులో అజయ్‌కుమార్ 100 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్‌లో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వారు పేర్కొన్నారు.

26 నుంచి మార్కెట్‌కు సెలవులు

జనగామ: జనగామ వ్యవసాయ మార్కెట్‌కు ఈనెల 26 నుంచి 30వ తేదీ వరకు సెలవులు ప్రకటించినట్లు ఏఎంసీ చైర్మన్ బాల్దె సిద్ధిలింగం ఒక ప్రకటనలో తెలిపారు. 26న ఆదివారం, 27న కార్తీక పౌర్ణమి, గురునానక్ జయంతి, సాధారణ ఎన్నికల నేపథ్యంలో మార్కెట్‌లో పోలింగ్ బూత్ ఏర్పాటు చేస్తున్న కారణంగా 28, 29, 30 తేదీల్లో సెలవు ప్రకటించినట్లు పేర్కొన్నారు. వచ్చే నెల 1వ తేదీన తిరిగి మార్కెట్ సేవలు అందుబాటులో ఉంటాయని, రైతులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



బుచ్చిరెడ్డి(ఫైల్)


నర్మెట: మండలంలోని మచ్చుపహాడ్‌కు చెందిన కార్ల బుచ్చిరెడ్డి(46) గురువారం సూర్యబండ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆయన ద్విచక్ర వాహనంపై రఘునాథపల్లి నుంచి మచ్చుపహాడ్‌కు వస్తుండగా మచ్చుపహాడ్ నుంచి రఘునాథపల్లి వైపు వెళ్తున్న ప్యాసింజర్ ఆటో ఢీకొట్టడంతో బుచ్చిరెడ్డి కిందపడిపోయాడు. తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై కె.శ్రీకాంత్ తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతి

జఫర్‌గఢ్: ఉప్పుగల్లు గ్రామానికి చెందిన గీత కార్మికుడు నాయిని కుమారస్వామి(50) తాటి చెట్టు పైనుంచి పడి మృతి చెందాడు. అతడి కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం .. గీత వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న కుమారస్వామి.. రోజు మాదిరిగానే గురువారం సాయంత్రం కల్లు గీయడానికి తాటి చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు జారి కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు.

ఆపరేషన్ 'ఆకర్ష్'

- ప్రత్యర్థి పార్టీలకు ఝలక్
- ఓటర్లను ప్రభావితం చేసే నాయకులు, క్యాడర్‌పై దృష్టి
- కండువాల మార్పిడికి ప్రాధాన్యం
- ఆఫర్లతో ఆకట్టుకునే ప్రయత్నం
- కమ్యూనిటీ సమావేశాల జోరు



జనగామ: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో రాజకీయ పార్టీలు ఆపరేషన్ 'ఆకర్ష్'కు తెరలేపుతున్నాయి. పోలింగ్‌కు మరో ఏడు రోజులు మాత్రమే మిగిలి ఉండడంతో ఎదుటి పార్టీల ప్రధాన కేడర్‌ను తమ వైపు తిప్పుకోవడానికి అసంతృప్తులకు గాలం వేస్తున్నారు. పేరు, పరపతి ఉన్న నేతలను చేర్చుకుంటే పైచేయి సాధించవచ్చని భావించి 'ఆఫర్ల'తో ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. మందు, విందు రాజకీయాలతో ప్రతీ ఓటును ఒడిసి పట్టేందుకు ఎవరి కి వారు జాగ్రత్త పడుతున్నారు. వ్యూహ, ప్రతి వ్యూహాలతో జిల్లా వ్యాప్తంగా ఎన్నిక ల వేడి మరింత పెరిగింది.

అసంతృప్తుల అలకపాన్పు..

పార్టీలో మొదటి నుంచి కష్టపడుతున్న నేతలు, నాయకులు, కార్యకర్తలకు గౌరవ మర్యాదలు తగ్గాయంటూ అలక పాన్పు వేస్తున్నారు. నేను చెబితే వందల ఓట్లు వస్తాయి.. వద్దంటే పోతాయంటూ అభ్యర్థులకు దడ పుట్టిస్తున్నారు. దీంతో పార్టీ మారి కండువాలు మార్చే కేడర్‌ను కాపాడుకోవడానికి స్థాయికి తగినట్టుగా రూ.25వేల నుంచి రూ.2లక్షల వరకు ముట్టు చెబుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. క్షేత్ర స్థాయిలో అత్యధిక ఓటర్లను ప్రభావితం చేయగలిగే సత్తా ఉన్న నేతలకు అందరికంటే ఎక్కువ ఆఫర్లు ప్రకటిస్తున్నారు. కొంతమంది ముఖ్య నాయకులు ఆఫర్లతో పాటు పార్టీ మారుతూ భవిష్యత్‌పై ముందస్తు ఒప్పందం సైతం కుదుర్చుకుంటున్నారు.

కమ్యూనిటీ సమావేశాల జోరు..

జిల్లాలోని ప్రధాన పార్టీల అభ్యర్థులు కమ్యూనిటీ ఓట్లపై దృష్టి సారించారు. కుల, మత, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, వైద్యులు, ఉద్యోగ, వ్యాపార సంఘాలతో పాటు అసోసియేషన్ల పెద్దలతో మంతనాలు జరుపుతున్నారు. స్థానిక సమస్యలతోపాటు కుల సంఘాలకు అవసరమైన పనులు, వారి డిమాండ్లను నెరవేరుస్తామని ముందస్తుగా హామీ ఇస్తున్నారు. పార్టీలకు ఉన్న ఓట్లతో పాటు గెలుపోటములపై ప్రభావితం చూపించే పలు సామాజిక వర్గాలను తమ వైపు తిప్పుకునేలా పెద్దలను ఒప్పించే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే ప్రధాన, ప్రతిపక్ష పార్టీలు పదికి పైగా కుల సంఘాలతో సమావేశం కాగా, మరో ఐదు రోజుల పాటు ఇదే పంథాను కొనసాగించనున్నారు. ఇదిలా ఉండగా.. చేరికలు, ప్రచారానికి సంబంధించి ఇంత పెద్ద మొత్తంలో ఖర్చు చేస్తున్నా.. ఎన్నికల సంఘం నిఘా కంట పడకుండా అన్ని పార్టీలు జాగ్రత్త పడుతున్నాయి.

చేరికలకు డిమాండ్..

రాజకీయ పార్టీల్లో ముఖ్య నాయకులు కొందరు అభ్యర్థి ప్రచార సమయంలో ఆ ఊరికి వచ్చే లోపే ఎవరెవరు పార్టీలు మారుతారనే ఖచ్చితమైన సమాచారం సేకరించి సిద్ధంగా ఉంచుతున్నారు. అధికార పార్టీ వార్డు సభ్యుల నుంచి మొదలుకుని గ్రామ, మండల అధ్యక్షుల వరకు రూ.10వేల నుంచి రూ.లక్ష వరకు.. ముఖ్య ప్రజాప్రతినిధులకు మాత్రం రూ.5 లక్షల వరకు డిమాండ్ ఉన్నట్లు చర్చజరుగుతోంది. ఇది కాకుండా ప్రచార సమయంలో హోదాను బట్టి రోజువారీ ఖర్చులు భరించడానికి అభ్యర్థులు ఒప్పుకోక తప్పడంలేదు. ప్రతిపక్ష పార్టీలు సైతం అధికార పార్టీతో సమానంగా బంపరాఫర్లు ప్రకటిస్తూ ఆకర్షించే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నాయి. అధికార పార్టీకి ఏమాత్రం తగ్గకుండా రూ.10వేల నుంచి రూ.2.50లక్షల వరకు ఆఫర్ చేస్తున్నట్లు సమాచారం.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

- రోజువారీ ఖర్చుల వివరాలు అందించాలి
- రాష్ట్ర ఎన్నికల వ్యయ పరిశీలకుడు బాలకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న బాలకృష్ణ

జనగామ రూరల్: ఎన్నికల నియమ నిబంధనలు పాటించాలి.. ఆ మేరకు రోజువారి వ్యయ పట్టికలు, సీజింగ్ వివరాలు అందించాలని రాష్ట్ర ఎన్నికల వ్యయ పరిశీలకుడు బీఆర్ బాలకృష్ణ ఆదేశించారు. జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ శివలింగయ్య, జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు తులేశ్వర్ ప్రసాద్, గన్నత్ ఝూ, డీసీపీ సీతారాంతో కలిసి గురువారం జిల్లా ఎన్నికల కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కంట్రోల్ రూం, వీడియో సర్వేలైన్ సిస్టం, సీ–విజిల్, సువిధ, మీడియా సెంటర్‌ను పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్‌లో జిల్లా పరిధి మూడు నియోజకవర్గాలకు సంబంధించిన ఎన్నికల వ్యయ పరిశీలన వివరాలు, నోడల్ అధికారులు తీసుకుంటున్న చర్యపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదాయ పన్ను శాఖ, ఎక్సైజ్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్, బ్యాంకింగ్ లావాదేవీలు, అనుమానిత చెల్లింపు వార్తలు, సోషల్ మీడియా, వాట్సాప్, ఫేస్‌బుక్, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లను నిత్యం గమనించాలని చెప్పారు. కలెక్టర్ శివలింగయ్య మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల నిర్వహణకు ప్రత్యేక విభాగ నోడల్ అధికారులను నియమించి నిత్యం ఉదయం, సాయంత్రం విధులు నిర్వర్తించేలా చర్యలతో పాటు రోజువారీ నివేదికలు తీసుకుంటున్నట్లు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో ఉప ఎన్నికల అధికారి సుహాసిని, ఎలక్షన్ నోడల్ అధికారి ఇస్మాయిల్, వినోద్‌కుమార్, రాంప్రసాద్, దుర్గారావు, కన్నా పర్శరాములు, ఎల్.మణికుమార్, ఏఓ రవీందర్ పాల్గొన్నారు.

ఆమె గెలిస్తే హైదరాబాద్‌కే పరిమితం



ఖిలాషాపూర్ ప్రచారంలో మాట్లాడుతున్న శ్రీహరి



స్టేషన్‌ఘన్‌పూర్‌లో మాట్లాడుతున్న కడియం

- ఎన్నికలప్పుడే కనిపించే నాయకురాలు సింగపురం ఇందిర
- బీఆర్ఎస్ స్టేషన్‌ఘన్‌పూర్ అభ్యర్థి కడియం శ్రీహరి

రఘునాథపల్లి: ఎన్నికలప్పుడే నియోజకవర్గానికి వచ్చే నాయకురాలు సింగపురం ఇందిర.. పొరబాటున గెలిస్తే హైదరాబాద్‌కే పరిమితమవుతుందని బీఆర్ఎస్ స్టేషన్‌ఘన్‌పూర్ అభ్యర్థి కడియం శ్రీహరి అన్నారు. గురువారం మండలంలోని వెల్ది, అశ్వరావుపల్లి, ఖిలాషాపూర్, నిడిగొండ, రఘునాథపల్లి, కంచనపల్లి ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ తెస్తామంటోన్న ఇందిరమ్మ రాజ్యంలో నాడు ఆకలిచావులు, నక్సలిజం, ఎమర్జెన్సీ లాంటి పరిస్థితులు ఉండేవనీ.. ఇందిరమ్మ పాలన బాగుంటే ఎన్టీఆర్ టీడీపీ ఎందుకు పెట్టేవారని అన్నారు. మూడు గంటల కరెంట్ కావాలాంటే కాంగ్రెస్‌కు, 24 గంటల కరెంట కోసం కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఎన్నికల ప్రచారానికి వచ్చిన కడియం శ్రీహరికి ఆయా గ్రామాల్లో మహిళలు మంగళహారతులతో ఘనస్వాగతం పలికారు. కార్యక్రమాల్లో జిల్లా రైతుబంధు సమితి సభ్యుడు మారుజోడు రాంబాబు, జెడ్పీటీసీ బొల్లం అజయ్, సర్పంచ్ పోకల శివకుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వారాల రమేష్, డాక్టర్ కృష్ణ, గవ్వాని నాగేశ్వర్, మల్కపురం లక్ష్మయ్య, నామాల బుచ్చయ్య, తూముకుంట్ల సురేందర్‌రెడ్డి, డి.మహిపాల్‌రెడ్డి, కావటి యాదగిరి, కుర్ర కమలాకర్, హుస్సేన్, బాషుమియా, చెంచు రమేష్, యాదగిరి, దుబ్బాక నాగేష్, హరీష్, బిర్రు మధు, అన్వేష్, జోషఫ్, హరినాథ్, నానాజీ, బి.ఐలయ్య, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

గెలిపిస్తే అభివృద్ధి చేస్తా..

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణలో గొల్ల కురుమలు, యాదవుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతో పనిచేస్తున్నారని, ఘన్‌పూర్ నియోజకవర్గం నుంచి మరోసారి తనను గెలిపిస్తే అన్ని విధాల అభివృద్ధి చేసి చూపిస్తానని కడియం శ్రీహరి అన్నారు. స్థానిక బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన యాదవ ముఖ్య నాయకుల సమావేశాన్ని గురువారం నిర్వహించారు. యాదవుల సంపూర్ణ మద్దతు కడియంకే అని యాదవ నాయకులు తీర్మానం చేశారు.

న్యాయవాదుల మద్దతు

కడియం శ్రీహరికే తమ సంపూర్ణ మద్దతు ఇస్తామని ఘన్‌పూర్ లీగల్ సెల్ ఇన్‌చార్జ్, న్యాయవాది కనకం రమేష్ అన్నారు. స్థానిక బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కడియంను నియోజకవర్గంలోని న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలిశారు.

బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలి

చిల్పూరు: సుపరిపాలన అందించే బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కడియం శ్రీహరి కుమార్తెలు.. కడియం ఫౌండేషన్ చైర్ పర్సన్ డాక్టర్ కావ్య, దివ్య, రమ్య కోరారు. లింగంపల్లి, చిన్నపెండ్యాల గ్రామాల్లో ప్రచారం చేశారు.

కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి

లింగాలఘణపురం: ఎన్నికలు పూర్తయ్యే వరకు బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పని చేయాలని జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి కోరారు. ఈ నెల 24న కడియం శ్రీహరి ప్రచార కార్యక్రమ నేపథ్యంలో మండల కేంద్రం, బండ్లగూడెం, గుమ్మడవెల్లి, జీడికల్, సిరిపురం, క్లోం గ్రామాల్లో సన్నాహక సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసుతో కలిసి పాల్గొన్నారు. యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీలో పాల్గొన్నారు.

కడియంతోనే మాదిగల అభివృద్ధి

కడియం శ్రీహరితోనే మాదిగల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడు కానుగంటి సురేశ్ అన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఈవీఎంల సాంకేతిక ప్రక్రియ వేగవంతం

- అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్



సమావేశంలో మాట్లాడుతున్న రోహిత్‌సింగ్

పాలకుర్తి టౌన్: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ఈవీఎంల సాంకేతిక ప్రక్రియ వేగవంతంగా సాగుతోందని పాలకుర్తి ఎన్నికల రిటర్నింగ్ అధికారి రోహిత్‌సింగ్ అన్నారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పోటీచేసే అభ్యర్థులు ఎన్నికల నియమావళిని తప్పకుండా పాటించాలన్నారు. ప్రచార రథాలను తిప్పడం, సభలు, సమావేశాల నిర్వహణలో సమయ పాలన పాటించాలని చెప్పారు. పోటీలో ఉన్న అభ్యర్థుల సమీక్ష నిర్వహించామని, అభ్యంతరాలేమీ లేవన్నారు. మాక్ పోలింగ్ నిర్వహించామని, ఈనెల 24, 25న ఓపీఓలకు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. 29న రాత్రి వరకు ఎన్నికల సామగ్రి, పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంల తరలించడం పూర్తవుతుందని తెలిపారు. 30న ఉదయం 5.30 గంటలకు పోలింగ్ కేంద్రాల్లో మాక్ పోలింగ్ నిర్వహించి 7 గంటల నుంచి పోలింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని వివరించారు. పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులు, వృద్ధులు ఇంటి వద్దకు వచ్చే పోలింగ్ సిబ్బంది ఎదుట ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. సమావేశంలో ఏఆర్‌ఓ, తహసీల్దార్ వెంకటేషం, సిబ్బంది పాల్గొన్నారు.

వైన్ షాపు ఏర్పాటుపై చర్య తీసుకోవాలి

- కలెక్టర్‌కు స్థానికుల ఫిర్యాదు



రఘునాథపల్లి–కంచనపల్లి రోడ్డులో ఏర్పాటు చేస్తున్న వైన్‌షాపు

రఘునాథపల్లి: మండల కేంద్రం కంచనపల్లి రోడ్డులోని రైల్వేగేట్ సమీపాన నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేస్తున్న వైన్ షాపుపై చర్యలు తీసుకోవాలని స్థానికులు గురువారం కలెక్టర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్, ఆర్‌అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు చేశారు. రఘునాథపల్లి–కంచనపల్లి వంద ఫీట్ల రోడ్డు స్థలాన్ని కబ్జా చేసి ప్రీకాస్టింగ్ గోడ నిర్మించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వైన్ షాపు ఏర్పాటుతో ప్రతి గురువారం ఈ ప్రదేశంలో నిర్వహించే సంతకు వచ్చే మహిళలు, చిరు వ్యాపారులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. నేషనల్ హైవేకు 220 మీటర్ల దూరంలో వైన్ షాపు ఏర్పాటు చేయాల్సి ఉండగా కేవలం 180 మీటర్ల దూరంలో ఏర్పాటు చేస్తున్నారని, దీనిని అడ్డుకోకుంటే మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని స్పష్టం చేశారు.

నేడు తొర్రూరులో ప్రియాంకగాంధీ సభ

- విజయవంతం చేయాలని ఝాన్సీరాజేందర్‌రెడ్డి పిలుపు

తొర్రూరు : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటే లక్ష్యంగా ఎన్నికల ప్రచారం నిర్వహించడానికి ఆ పార్టీ నాయకురాలు ప్రియాంకగాంధీ శుక్రవారం(నేడు) తొర్రూరుకు వస్తున్నారు. స్థానిక ఆర్యభట్ట స్కూల్ సమీప చాకలి ఐలమ్మ సభాప్రాంగణంలో తలపెట్టిన కాంగ్రెస్ విజయభేరి సభను విజయవంతం చేయాలని హనుమాండ్ల ఝాన్సీరాజేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఆయన తొర్రూరు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నియోజకవర్గ పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి యశస్వినిరెడ్డి, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, తొర్రూరు పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, తొర్రూరు మండల అధ్యక్షుడు సంతోష్ పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

జనగామ రూరల్: విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా కష్టపడి చదివితేనే అనుకున్న లక్ష్యం నెరవేరుతుందని పీజీ హెచ్‌ఎం శ్రీనివాస్‌రావు అన్నారు. ప్యానల్ ఇన్స్‌పెక్షన్‌లో భాగంగా ఆయన పట్టణంలోని యూఆర్ఎస్ పాఠశాలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన విద్యార్థులకు జామెట్రీ బాక్స్‌లు, అలాగే నీరజ, ఉమాదేవి రూ.500ల చొప్పున పాఠశాలకు అందజేశారు. ఎస్‌ఓ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణను దగా చేసింది కాంగ్రెస్సే



దేవరుప్పుల: నీర్మాలలో మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు



పాలకుర్తి: బీఆర్ఎస్‌లో చేరిన వారితో మంత్రి దయాకర్‌రావు

- ఆ పార్టీ వాగ్దానాలు నమ్మి మోసపోవద్దు
- బీఆర్ఎస్ పాలకుర్తి అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు

దేవరుప్పుల: ఆరు దశాబ్దాలపాటు తెలంగాణ రాష్ట్రాన్ని అన్నివిధాలుగా దగా చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుంది.. మరోసారి ఆ పార్టీ వాగ్దానాలకు మోసపోవద్దని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి, బీఆర్ఎస్ పాలకుర్తి అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. గురువారం మండల పరిధిలోని రామరాజుపల్లి, నీర్మాల, సింగరాజుపల్లి, చౌడూరు, మాధాపురం, పెద్దమడూరు, సీతారాంపురం గ్రామాల్లో ఎర్రబెల్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోరాడి సాధించుకున్న ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణంలో పేదల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ చారిత్రాత్మక సంక్షేమ పథకాలు చేపట్టి దేశంలోనే అగ్రభాగాన నిలిచారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో రూ.730కోట్లతో అభివృద్ధి పనులు, మౌలిక వసతులు కల్పించిన తాను.. ఆరుసార్లు చట్టసభల్లో నిలిచి తన జీవితం ప్రజాసేవకు అంకితం చేశానని అన్నారు. కార్యక్రమాల్లో ఎంపీపీ బస్వ సావిత్రిమల్లేషం, జెడ్పీటీసీ పల్లా భార్గవి సుందర్ రాంరెడ్డి, వైస్ ఎంపీపీ విజయ్, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు దయాకర్, రవి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రామ్‌సింగ్, విక్రమ్‌రెడ్డి, దామెదర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో కరచాలనం చేస్తున్న ఎర్రబెల్లి

బీఆర్ఎస్‌లో చేరిక..

పాలకుర్తి: పలు గ్రామాల నుంచి కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఎర్రబెల్లి దయాకర్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈసందర్భంగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గోపాలపురం కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు కుసుమ సోమిరెడ్డి, పెద్ద రాంరెడ్డి చేరికలో ఉన్నారు.

బీఆర్ఎస్ గెలుపు ఖాయం : ఎర్రబెల్లి ఉషాదేవి

రాష్ట్రంలో బీఆర్ఎస్ గెలుపు ఖాయమని మంత్రి దయాకర్‌రావు సతీమణి, ఎర్రబెల్లి ట్రస్ట్ చైర్‌పర్సన్ ఉషాదేవి అన్నారు. గురువారం పాలకుర్తిలో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, జెడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాసరావు, సర్పంచ్ వీరమనేని యాకాంతరావు, మార్కెట్ చైర్మన్ ముస్కు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సంఘాల మద్దతు..

తొర్రూరు రూరల్: ఎమ్మెల్యే అభ్యర్థి దయాకర్ రావుకు తొర్రూరు మండలానికి చెందిన నాయీ బ్రాహ్మణ సంఘం గురువారం సంపూర్ణ మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా సంఘం మండల, పట్టణ అధ్యక్షులు ఎనగందుల శ్రీనివాస్, ఎల్.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కొడకండ్ల: నిత్యం జనం మధ్యలో ఉంటూ అభివృద్ధికి పాటుపడే మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు ఓయూ జేఏసీ, బీఆర్ఎస్ యువజన, బీఆర్ఎస్‌వీ నాయకులు హరినాథ్, రవికుమార్, వెంకటేష్, సుధీర్, రామకృష్ణ తమ సంపూర్ణ మద్దతు తెలియజేశారు.

తొర్రూరు: ఎన్నారైల మద్దతు దయాకర్‌రావుకేనని బీఆర్ఎస్ యూఎస్‌ఏ అధ్యక్షుడు మహేష్ తన్నీరు తెలిపారు. సమావేశంలో ఎన్నారైలు జక్కిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పిన్న భాస్కర్, కిశోర్, లింగారెడ్డి, అభిషేక్, బిందులత, రమేష్ పాల్గొన్నారు.

ఆడబిడ్డగా వస్తున్నా.. ఆదరించండి



పెర్కవేడు ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న యశస్వినిరెడ్డి



ప్రచార ర్యాలీలో పాల్గొన్న ప్రజలు

- నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తా..
- కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి అభ్యర్థి యశస్వినిరెడ్డి

రాయపర్తి: ఆడబిడ్డగా వస్తున్నాను.. ఆదరించి గెలిపించండి.. పాలకుర్తి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. గురువారం ఆమె మండల పరిధి కొండాపురం, పెర్కవేడు, మహబూబ్‌నగర్, రాగన్నగూడెం, గణేష్‌కుంటతండా, మైలారం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, ప్రజలంతా చేతి గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మంత్రిగా పని చేసిన ఎర్రబెల్లి దయాకర్‌రావు పాలకుర్తికి చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో సర్పంచ్‌ల పరిస్థితి అధ్వానంగా తయారైందని, తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత వచ్చే జీతం ప్రజల అవసరాలకు ఖర్చుచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమాల్లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హామ్యానాయక్, నాయకులు కాకిరాల హరిప్రసాద్, ముత్తినేని సోమేశ్వర్‌రావు, సరికొండ కృష్ణారెడ్డి, మాచర్ల ప్రభాకర్, రెంటాల గోవర్ధన్‌రెడ్డి, కుందూరు విక్రమ్‌రెడ్డి, ఎనగందుల మురళి, చిన్నాల కిషన్, కౌడగాని ఉమ, అనిత, బండి కుమార్, వెంకటాచారి, పుల్లూరు దామోదర్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



తొర్రూరు : కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ నాయకులతో ఝాన్సీరెడ్డి

కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు

తొర్రూరు రూరల్/పాలకుర్తి టౌన్/దేవరుప్పుల : తొర్రూరు మండలం చీకటాయపాలెంకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గౌతంరెడ్డి, ఉప సర్పంచ్ గజ్జి రాధ, వార్డు సభ్యులు బొలగాని రజిత, వెల్పుకొండ సుధాకర్ తదితరులు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అనుమాండ్ల ఝాన్సీరెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. అలాగే పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు కాటి పాపల ఎల్లస్వామి, వల్లాల రజనీకాంత్ ఝాన్సీరెడ్డి సమంక్షలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల కార్యదర్శి బైరు భార్గవ్ తదితరులు పాల్గొన్నారు. దేవరుప్పుల మండలం మాధాపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ ఉప సర్పంచ్‌తో పాటు మరో 15 మంది ఝాన్సీరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. చేరిన వారిలో కొడగాని రతన్, వర్రె సంపత్, చిలుకాని రవి, ననుబోతుల లింగస్వామి, కావటి రాములు, చిలికాని దయాకర్, శీల యాదగిరి, మడికొండ శ్రీను, మడికొండ యాకన్న, బిక్షపతి, గుర్రం పరశురాములు ఉన్నారు.

ఝాన్సీరాజేందర్‌రెడ్డి దంపతులకు స్వాగతం

దేవరుప్పుల : కాంగ్రెస్ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి భర్త రాజేందర్‌రెడ్డి అమెరికా నుంచి ఇక్కడికి రావడంతో పార్టీ శ్రేణులు గజమాలతో సత్కరించారు. జనగామ–సూర్యాపేట రహదారి బంజర నుంచి మున్‌పహాడ్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు నల్ల శ్రీరాములు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కాసారపు ధర్మారెడ్డి, అనుబంధ కమిటీల అధ్యక్షులు యాకస్వామి, గణేష్, అనిల్, ప్రకాష్, యాదగిరి, తోటకూరి రమేష్, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి బిజినెస్
శుక్రవారం
24-11-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	5	66,018
నిఫ్టీ ▽	10	19,802

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	14,266	△	66
డోజోన్స్	35,273	▽	185
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,484	△	14
డాక్స్	15,995	△	37
షాంఘై	3,062	△	18
నికాయ్	33,452	△	98

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)	61,394 ▽	222
బంగారం (99.5 స్వచ్ఛత)	61,148 ▽	221
వెండి (కిలో)	73,065 ▽	400

ఫారెక్స్ రేట్లు రూ.లలో

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	82.53	84.20
£	బ్రిటన్ పౌండ్	102.55	105.90
€	యూరో	89.35	92.43
¥	జపాన్ ఎన్ (100)	62.71	64.78
AUS	ఆస్ట్రేలియా డాలర్	53.43	55.78
S$	సింగపూర్ డాలర్	61.81	63.86
SAR	సౌదీ రియాల్	21.27	22.89
UAE D	యూఏఈ దిర్హామ్	21.79	23.59
¥	చైనా యువాన్	10.55	12.62

ఏటా 10 శాతం చొప్పున జీవితాంతం

- డిసెంబర్‌లో ఎల్‌ఐసీ కొత్త ప్లాన్
- మూడు–నాలుగు కొత్త పాలసీలకు ప్రణాళికలు



న్యూఢిల్లీ: జీవిత బీమా రంగ దిగ్గజం ఎల్‌ఐసీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మూడు నుంచి నాలుగు వరకు నూతన పాలసీలను ఆవిష్కరించనుంది. నూతన వ్యాపార ప్రీమియంలో రెండంకెల వృద్ధిని సాధించాలనే లక్ష్యంతో ఉంది. ''గతేడాదితో పోలిస్తే రెండంకెల వృద్ధిని సాధిస్తాం. ఎందుకంటే ఇండివిడ్యువల్ రిటైల్ వ్యాపారం పుంజుకుంటున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ఆకర్షణీయమైన కొత్త పాలసీలను ఆవిష్కరించనున్నాం''అని ఎల్‌ఐసీ చైర్మన్ సిద్ధార్థ మహంతి తెలిపారు. డిసెంబర్ మొదటి వారంలో ఎల్‌ఐసీ ఒక ఉత్పత్తిని తీసుకువస్తుందని వెల్లడించారు. దీనితో మార్కెట్లో మంచి స్పందన వస్తుందని ఆశిస్తున్నట్టు చెప్పారు. డిసెంబర్‌లో తెచ్చే నూతన పాలసీ గురించి వివరిస్తూ.. పాలసీ మెచ్యూరిటీ తర్వాత (గడువు ముగిసిన అనంతరం) జీవితాంతం ఏటా సమ్ అష్యూర్డ్‌లో (బీమా కవరేజీలో) 10 శాతం చొప్పున లభిస్తుందని తెలిపారు. ఇది మార్కెట్లో సంచలనాన్ని సృష్టిస్తుందన్నారు. 20–25 ఏళ్ల తర్వాత ఎంత చొప్పున వస్తుంది, ఎంత ప్రీమియం చెల్లించాలన్నది తెలుసుకునేందుకు ప్రతి ఒక్కరూ ఆసక్తి చూపిస్తారని పేర్కొన్నారు. ఈ ప్లాన్‌పై రుణ సదుపాయం, ముందస్తు ఉపసంహరణకూ అవకాశం ఉంటుందన్నారు. హామీతో కూడిన రాబడులు ఇచ్చే పాలసీలకు పాలసీదారులు, వాటాదారులు ఆసక్తి చూపిస్తున్నారని చెబుతూ.. తమ కంపెనీ వాటాదారుల్లో చాలా మంది పాలసీదారులుగా ఉన్నట్టు మహంతి తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో (ఏప్రిల్–సెప్టెంబర్) నూతన వ్యాపార ప్రీమియం (ఇండివిడ్యువల్) 2.65 శాతమే వృద్ధి చెంది రూ.25,184 కోట్లకు చేరుకోవడం గమనార్హం.

అమెజాన్‌తో వాణిజ్య శాఖ ఒప్పందం

చిన్న సంస్థలకు ఎగుమతులపై శిక్షణ



న్యూఢిల్లీ: దేశీయంగా 20 జిల్లాల్లోని చిన్న, మధ్య తరహా సంస్థలకు (ఎంఎస్‌ఎంఈ) శిక్షణ కల్పించే దిశగా ఈ–కామర్స్ దిగ్గజం అమెజాన్‌తో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకున్నట్లు కేంద్ర వాణిజ్య శాఖ వెల్లడించింది. దీని ప్రకారం ఈ–కామర్స్ మాధ్యమం ద్వారా ఎగుమతులను ప్రోత్సహించే దిశగా ఇమేజింగ్, డిజిటల్ క్యాటలాగ్‌లను రూపొందించడం, పన్నుల సంబంధమైన అంశాలను తెలుసుకోవడం మొదలైన వాటికి ఈ శిక్షణ ఉపయోగపడగలదని పేర్కొంది. ఎగుమతుల హబ్‌లుగా గుర్తించిన జిల్లాల్లో అమెజాన్, డీజీఎఫ్‌టీ కలిసి శిక్షణ, వర్క్‌షాప్‌లను నిర్వహిస్తాయి. ఇతర జిల్లాల్లోనూ ఇదే తరహా కార్యక్రమాల కోసం ఫ్లిప్‌కార్ట్, ఈబే, రివెక్సా, షిప్‌రాకెట్, షాప్‌క్లూస్ వంటి వివిధ ఈ–కామర్స్ సంస్థలతో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) చర్చలు జరుపుతున్నట్లు వాణిజ్య శాఖ ఒక ప్రకటనలో వివరించింది. ఈ–కామర్స్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా దేశీ సంస్థలు అంతర్జాతీయంగా మరిన్ని ఎగుమతి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఈ ఒప్పందాలు ఉపయోగపడతాయి. 2030 నాటికి ఈ–కామర్స్ ద్వారా 350 బిలియన్ డాలర్ల విలువ చేసే ఉత్పత్తులను ఎగుమతి చేయాలని భారత్ లక్ష్యంగా నిర్దేశించుకోవాలని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్‌ఐ) ఇటీవల ఒక నివేదికలో పేర్కొంది. ప్రస్తుతం ఇవి 2 బిలియన్ డాలర్లుగా మాత్రమే ఉన్నాయి. ఎగుమతులను సరళతరం చేయడం, 2025 నాటికి ఈ–కామర్స్ ఎగుమతులను 20 బిలియన్ డాలర్లకు చేర్చడంపై ప్రధానంగా దృష్టి పెట్టనున్నట్లు అమెజాన్ ఇండియా డైరెక్టర్ భూపేన్ వాకంకర్ తెలిపారు.

ఇరెడా ఐపీవో సక్సెస్



చివరి రోజుకల్లా 39 రెట్లు అధిక బిడ్స్

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ మినీరత్న సంస్థ ఇండియన్ రెనెవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ(ఐఆర్‌ఈడీఏ–ఇరెడా) పబ్లిక్ ఇష్యూ విజయవంతమైంది. చివరి రోజు గురువారానికల్లా 39 రెట్లు అధిక స్పందన నమోదైంది. కంపెనీ 47 కోట్లకుపైగా షేర్లను ఆఫర్ చేయగా.. 1,827 కోట్లకుపైగా షేర్ల కోసం దరఖాస్తులు దాఖలయ్యాయి. సంస్థాగతేతర ఇన్వెస్టర్ల నుంచి 24 రెట్లు, రిటైలర్ల నుంచి దాదాపు 8 రెట్లు అధికంగా బిడ్స్ లభించాయి. అర్హతగల కొనుగోలుదారుల(క్విబ్) విభాగంలో అయితే దాదాపు 105 రెట్లు అధికంగా దరఖాస్తులు వెల్లువెత్తాయి. రూ. 30–32 ధరల శ్రేణిలో చేపట్టిన ఇష్యూలో భాగంగా సోమవారం(20న) యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ. 643 కోట్లు సమీకరించిన సంగతి తెలిసిందే.

ఈక్విటీ వివరాలిలా

ఐపీవోలో భాగంగా 40.31 కోట్ల ఈక్విటీ షేర్లను ఇరెడా తాజాగా జారీ చేయనుంది. అంతేకాకుండా కంపెనీ ప్రమోటర్ కేంద్ర ప్రభుత్వం 26.88 కోట్ల షేర్లను విక్రయానికి ఉంచింది. ఈక్విటీ జారీతో రూ. 1,290 కోట్లు, ప్రభుత్వ వాటాకు రూ. 860 కోట్ల చొప్పున లభించనున్నాయి. వెరసి ఇష్యూ ద్వారా కంపెనీ మొత్తం రూ. 2,150 కోట్లు సమకూర్చుకోనుంది. గతేడాది మే నెలలో బీమా రంగ దిగ్గజం ఎల్‌ఐసీ లిస్టింగ్ తదుపరి మళ్లీ ప్రభుత్వ రంగ సంస్థ పబ్లిక్ ఇష్యూకి రావడం విశేషం! కాగా.. ఈక్విటీ జారీ నిధులను కంపెనీ భవిష్యత్ పెట్టుబడి అవసరాలరీత్యా మూలధన పటిష్టతకు వినియోగించనుంది.

ప్యూర్ ఈవీ నుంచి ఎకోడ్రిఫ్ట్ బైక్

ధర రూ. 1,29,999



హైదరాబాద్: ఎలక్ట్రిక్ వాహనాల సంస్థ ప్యూర్ ఈవీ తమ కొత్త మోటార్ సైకిల్ వేరియంట్ ఎకోడ్రిఫ్ట్ 350ని ఆవిష్కరించింది. దీన్ని ఒక్కసారి చార్జి చేస్తే 171 కి.మీ. వరకు ప్రయాణించగలదు. ప్రతి రోజూ ఎక్కువ దూరాలు ప్రయాణించే వినియోగదారులకు ఇది ఎంతో అనువుగా ఉంటుందని సంస్థ తెలిపింది. దీనితో నెలవారీగా రూ. 7,000 పైచిలుకు ఆదా కాగలదని వివరించింది. దీని ధర రూ. 1,29,999గా ఉంటుందని ప్యూర్ సహ వ్యవస్థాపకుడు రోహిత్ వదేరా తెలిపారు. సులభతరమైన ఈఎంఐ సదుపాయం రూ. 4,000 నుంచి ఉంటుందని పేర్కొన్నారు. 110 సీసీ సెగ్మెంట్‌లో హీరో స్ప్లెండర్, హోండా షైన్, బజాజ్ ప్లాటినా వంటి మోటార్‌సైకిల్స్‌తో దీటుగా పోటీపడగలిగేలా దీన్ని తీర్చిదిద్దినట్లు వివరించారు. ఇందులో రివర్స్ మోడ్, హిల్ స్టార్ట్ అసిస్ట్, డౌన్ హిల్ అసిస్ట్ వంటి ఫీచర్లు కూడా ఉన్నాయి. 75 కి.మీ. గరిష్ట వేగంతో ప్రయాణించగలదు.

ఫేమ్ ఉల్లంఘనలపై విచారణ

నెల రోజుల్లో నివేదిక; తర్వాత చర్యలు



న్యూఢిల్లీ: ఫేమ్–2 స్కీము నిబంధనల ఉల్లంఘనలో అధికారులపరంగా తప్పిదాలు జరిగాయన్న ఆరోపణలపైనా కేంద్రం దృష్టి పెట్టింది. వాటితో పాటు వేలిడేషన్, టెస్టింగ్ ఏజెన్సీలైన ఆటోమోటివ్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఏఆర్‌ఏఐ), ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ ఆటోమోటివ్ టెక్నాలజీ (ఐసీఏటీ) అధికారుల పాత్రపైనా కేంద్ర భారీ పరిశ్రమల శాఖ విచారణ ప్రారంభించింది. దీనికి సంబంధించి నెల రోజుల వ్యవధిలో నివేదిక రావచ్చని శాఖ కార్యదర్శి కమ్రాన్ రిజ్వీ తెలిపారు. ఆ తర్వాత ఉల్లంఘనలకు బాధ్యులైన వారితో పాటు సిస్టమ్స్‌ను కూడా సరిదిద్దే చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. స్థానికంగా తయారీని, విద్యుత్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు.. ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థలకు సబ్సిడీలు ఇచ్చేలా కేంద్రం రూ. 10,000 కోట్లతో ఫేమ్–2 స్కీమును ప్రవేశపెట్టింది. అయితే, నిబంధనలకు విరుద్ధంగా పలు కంపెనీలు పెద్ద స్థాయిలో దిగుమతి చేసుకుంటున్నాయని, ఏడు సంస్థలు నిబంధనలకు విరుద్ధంగా ప్రోత్సాహకాలు పొందాయని ఆరోపణలొచ్చాయి.

ఆచితూచి రుణాలివ్వండి..!

- ఎన్‌బీఎఫ్‌సీలకు కేంద్ర ఆర్థిక మంత్రి సూచన
- అత్యుత్సాహం ప్రదర్శించొద్దని హితవు



న్యూఢిల్లీ: ఆర్‌బీఐ సూచించిన విధంగా బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు, స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌లు రుణ వితరణలో అప్రమత్తంగా వ్యవహరించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సూచించారు. ఎర్రటి గీతను (హద్దులను/పరిమితులను) గౌరవించాలని, అత్యుత్సాహంతో దూకుడుగా వ్యవహరించరాదని కోరారు. వ్యక్తిగత రుణాలు, క్రెడిట్‌కార్డ్ రుణ విభాగంలో (అన్‌సెక్యూర్డ్) బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు గడిచిన కొన్నేళ్లలో భారీ వృద్ధిని చూపిస్తుండడం తెలిసిందే. ఫలితంగా ఈ విభాగంలో ఎన్‌పీఏలు క్రమంగా పెరుగుతున్నాయి. దీంతో రిస్క్ నియంత్రణకు గాను ఆర్‌బీఐ ఇటీవలే నిబంధనలు కఠినతరం చేయడం తెలిసే ఉంటుంది. వ్యక్తిగత రుణాలు, క్రెడిట్ కార్డ్‌ల రుణాలకు గాను రిస్క్ వెయిటేజీని 0.25 శాతం మేర పెంచింది. దీనివల్ల బ్యాంకుల వరకే రూ.84,000 కోట్లను అదనంగా పక్కన పెట్టాల్సి రావచ్చని అంచనా. 'డేట్ విత్ టెక్' కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా మంత్రి సీతారామన్ ఈ అంశాన్ని ప్రస్తావించారు. ''ఉత్సాహం మంచిదే. కానీ, కొన్ని సందర్భాల్లో ఇదీ మరీ ఎక్కువైతే జీర్ణించుకోవడం కష్టం. దీంతో జాగ్రత్తగా ఉండాలని, దూకుడుగా వ్యవహరించడం ద్వారా తర్వాత రిస్కులు చవిచూడొద్దన్న ఉద్దేశంతోనే ఆర్‌బీఐ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలను అప్రమత్తం చేసింది'' అని మంత్రి సీతారామన్ వివరించారు.

డేటా సురక్షితం

అకౌంట్ అగ్రిగేటర్లతో (ఏఏ) పంచుకునే కస్టమర్ల డేటా దేశంలో పూర్తి సురక్షితంగా ఉంటుందని మంత్రి సీతారామన్ హామీనిచ్చారు. డేటా భద్రత విషయంలో వ్యక్తమవుతున్న ఆందోళనను తొలగించే ప్రయత్నం చేశారు. ''అకౌంట్ అగ్రిగేటర్లు డేటా బ్యాంక్ కలిగి ఉంటారనే అభిప్రాయాలు ఉండేవి. నిజానికి వారు డేటా కలిగి ఉండరు. వారి ద్వారా డేటా బదిలీ అవుతుంది. ఏఏ ద్వారా బ్యాంక్ కానీ, కస్టమర్ కానీ డేటా కలిగి ఉండరు. కేవలం రుణాల మంజూరీకే దీన్ని వినియోగించుకుంటారు''అని మంత్రి చెప్పారు.

ఆరంభ లాభాలు ఆవిరి..



ముంబై: ట్రేడింగ్‌లో తీవ్ర ఒడిదుడుకులకు లోనైన స్టాక్ సూచీలు గురువారం చివరికి స్వల్ప నష్టాలతో ముగిశాయి. సెన్సెక్స్ 5 పాయింట్లు నష్టపోయి 66,018 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 10 పాయింట్లు పతనమై 19,802 వద్ద నిలిచింది. ఫార్మా, ఐటీ, కన్జూమర్ డ్యూరబుల్స్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఉదయం సానుకూలంగా మొదలైన సూచీలు ఆరంభ లాభాలను నిలుపుకోవడంలో విఫలమయ్యాయి. ట్రేడింగ్ ఆద్యంతం పరిమిత శ్రేణిలో తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యాయి. ఇంధన, రియల్టీ, టెలికం, మెటల్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు అరశాతం చొప్పున రాణించాయి. అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవుతున్నాయి.

''నిఫ్టీ 19,800 స్థాయిని దాటి ముందుకెళ్లేందుకు ప్రోత్సాహానిచ్చే కీలక పరిణామాలేవీ లేకపోవడంతో పరిమిత శ్రేణి ట్రేడింగ్ రెండోరోజూ కొనసాగింది. క్రూడాయిల్ ధరలు, బాండ్లపై రాబడులు దిగిరావడం వంటి అంశాలు దేశీయ మార్కెట్ పతనాన్ని అడ్డుకుంటున్నాయి'' అని జియోజిత్ ఫైనాన్సియల్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

సాక్షి స్పోర్ట్స్



క్వార్టర్ ఫైనల్లో రష్మిక

మహిళల ప్రపంచ టెన్నిస్ టూర్ టోర్నీలో హైదరాబాద్ అమ్మాయి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక సింగిల్స్‌లో క్వార్టర్ ఫైనల్లోకి... డబుల్స్‌లో సెమీఫైనల్లోకి ప్రవేశించింది. బెంగళూరులో జరుగుతున్న ఈ టోర్నీలో గురువారం జరిగిన సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో 21 ఏళ్ల రష్మిక 4–6, 7–5, 7–5తో నాలుగో సీడ్ వైదేహి (గుజరాత్)ను ఓడించింది. 2 గంటల 53 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రష్మిక నాలుగు ఏస్‌లు సంధించింది. ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసిన రష్మిక తన సర్వీస్‌ను నాలుగుసార్లు కోల్పోయింది. డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో రష్మిక–వైదేహి (భారత్) జోడీ 6–0, 6–3తో కశిష్ భాటియా–వన్షిత (భారత్) జంటపై నెగ్గింది. హైదరాబాద్‌కే చెందిన యడ్లపల్లి ప్రాంజల పోరాటం ఈ టోర్నీలో ముగిసింది. సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రాంజల 4–6, 3–6తో రుతుజా భోస్లే (భారత్) చేతిలో ఓడిపోయింది.

ప్రణయ్ ముందంజ



షెన్‌జెన్: చైనా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–750 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్‌లో భారత నంబర్‌వన్ హెచ్‌ఎస్ ప్రణయ్ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రణయ్ 21–12, 21–18తో మాగ్నస్ జొనాసెన్ (డెన్మార్క్)పై గెలుపొందాడు. మరోవైపు పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి (భారత్) ద్వయం కూడా క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో సాత్విక్–చిరాగ్ జోడీ 21–15, 21–16తో అకీరా కొగా–తైచి సైటో (జపాన్) జంటపై గెలిచింది.

రన్నరప్ హారిక



సాక్షి, హైదరాబాద్: జూలియస్ బేర్ అంతర్జాతీయ మహిళల ఆన్‌లైన్ స్పీడ్ చెస్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక రన్నరప్‌గా నిలిచింది. చైనా గ్రాండ్‌మాస్టర్ హు ఇఫాన్‌తో జరిగిన ఫైనల్లో హారిక 11–15 పాయింట్ల తేడాతో ఓడిపోయింది. విజేతగా నిలిచిన హు ఇఫాన్‌కు 15,769 డాలర్లు (రూ. 13 లక్షల 13 వేలు), రన్నరప్ హారికకు 4,230 డాలర్లు (రూ. 3 లక్షల 52 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

ఐపీఎల్‌కు స్టోక్స్ దూరం




చెన్నై: ఇంగ్లండ్ స్టార్ ఆల్‌రౌండర్, చెన్నై సూపర్ కింగ్స్ జట్టు సభ్యుడు బెన్ స్టోక్స్ వచ్చే ఏడాది ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) నుంచి వైదొలిగాడు. పనిభారాన్ని తగ్గించుకోవడానికి స్టోక్స్ ఈ నిర్ణయం తీసుకున్నాడు. వచ్చే ఏడాది ఐపీఎల్ కంటే ముందు భారత జట్టుతో ఇంగ్లండ్ ఐదు టెస్టుల సిరీస్ ఆడనుంది. ఆ తర్వాత జూన్‌లో టి20 వరల్డ్‌కప్ ఉంది. ఈ నేపథ్యంలో పూర్తి ఫిట్‌గా ఉండాలనే ఉద్దేశంతో స్టోక్స్ ఐపీఎల్ నుంచి తప్పుకున్నాడు. స్టోక్స్‌ను చెన్నై ఫ్రాంచైజీ రూ. 16 కోట్ల 25 లక్షలకు తీసుకోగా అతను ఈ ఐపీఎల్ సీజన్‌లో కేవలం రెండు మ్యాచ్‌లు ఆడి మోకాలి గాయంతో మిగతా టోర్నీకి దూరమయ్యాడు.

ఆఖరి బంతికి గట్టెక్కాం

- ఉత్కంఠపోరులో భారత్ విజయం
- కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడిన సూర్యకుమార్
- రాణించిన ఇషాన్, రింకూ సింగ్
- తొలి టి20 మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఓటమి
- ఇన్‌గ్లిస్ సెంచరీ వృథా
- 26న రెండో టి20 మ్యాచ్


సూర్య

సాక్షి, విశాఖపట్నం: పరుగుల వరద పారిన మ్యాచ్‌లో చివరికి భారత జట్టుదే పైచేయిగా నిలిచింది. ఆస్ట్రేలియాతో ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో టీమిండియా శుభారంభం చేసింది. గురువారం ఇక్కడి డాక్టర్ వైఎస్‌ఆర్–ఏసీఏ–వీడీసీఏ స్టేడియంలో జరిగిన తొలి టి20 మ్యాచ్‌లో సూర్యకుమార్ యాదవ్ నాయకత్వంలోని భారత జట్టు రెండు వికెట్ల తేడాతో ఆస్ట్రేలియా జట్టును ఓడించింది. తొలిసారి జాతీయ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన మ్యాచ్‌లో సూర్యకుమార్ టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకోగా... మొదట బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్లకు 208 పరుగులు సాధించింది. జోష్ ఇంగ్లిస్ (50 బంతుల్లో 110; 11 ఫోర్లు, 8 సిక్స్‌లు) అంతర్జాతీయ కెరీర్‌లో తొలి సెంచరీ సాధించగా... ఓపెనర్‌గా వచ్చిన స్టీవ్ స్మిత్ (41 బంతుల్లో 52; 8 ఫోర్లు) అర్ధ సెంచరీ చేశాడు. వీరిద్దరు మూడో వికెట్‌కు 130 పరుగులు జోడించారు. ఇన్‌గ్లిస్ 47 బంతుల్లో సెంచరీ చేశాడు. ఈ క్రమంలో ఆస్ట్రేలియా తరఫున టి20ల్లో వేగవంతమైన సెంచరీ చేసిన ప్లేయర్‌గా ఆరోన్ ఫించ్ (47 బంతుల్లో) పేరిట ఉన్న రికార్డును సమం చేశాడు. అనంతరం భారత జట్టు 19.5 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 209 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (42 బంతుల్లో 80; 9 ఫోర్లు, 4 సిక్స్‌లు), ఇషాన్ కిషన్ (39 బంతుల్లో 58; 2 ఫోర్లు, 5 సిక్స్‌లు)– అర్ధ సెంచరీలతో అదరగొట్టగా... రింకూ సింగ్ (14 బంతుల్లో 22 నాటౌట్; 4 ఫోర్లు) ఫినిషింగ్ టచ్ ఇచ్చాడు. భారత్ విజయానికి ఆఖరి బంతికి ఒక పరుగు అవసరంకాగా... సీన్ అబాట్ వేసిన బంతిని రింకూ సింగ్ సిక్సర్‌గా మలిచి భారత విజయాన్ని ఖరారు చేశాడు. అయితే టీవీ రీప్లేలో అబాట్ వేసిన బంతి నోబాల్ అని తేలడంతో అక్కడే భారత విజయం ఖాయమైంది. దాంతో రింకూ సింగ్ సిక్స్‌ను లెక్కలోకి తీసుకోలేదు. టి20ల్లో భారత జట్టుకిదే అత్యధిక ఛేజింగ్ కావడం విశేషం. సిరీస్‌లోని రెండో టి20 మ్యాచ్ ఈనెల 26న తిరువనంతపురంలో జరుగుతుంది.


జోష్ ఇన్‌గ్లిస్

సూర్య, ఇషాన్ ధనాధన్

భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు శుభారంభం లభించలేదు. ఓపెనర్ యశస్వి జైస్వాల్ (8 బంతుల్లో 21; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు)తో సమన్వయలోపం కారణంగా మరో ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్ (0) ఒక్క బంతి ఆడకుండానే తొలి ఓవర్లోనే రనౌటయ్యాడు. అనంతరం మూడో ఓవర్లో యశస్వి భారీ షాట్‌కు యత్నించి నిష్క్రమించాడు. ఈ దశలో ఇషాన్, సూర్యకుమార్ జత కలిశారు. వీరిద్దరు ఎక్కడా తగ్గకుండా ఆసీస్ బౌలర్లపై విరుచుకుపడ్డారు. దాంతో భారత్ స్కోరు 4.5 ఓవర్లలో 50 దాటింది. పవర్‌ప్లే ముగిసే సరికి భారత్ 2 వికెట్లకు 63 పరుగులు సాధించింది. ఆ తర్వాత కూడా ఇషాన్, సూర్య జోరు కొనసాగించడంతో భారత్ 9.1 ఓవర్లలో 100 పరుగులు చేసింది. ఇషాన్ 37 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఇన్నింగ్స్ 13వ ఓవర్లో భారీ షాట్‌కు యత్నించి డీప్ ఎక్స్‌ట్రా కవర్‌లో షార్ట్ చేతికి చిక్కడంతో ఇషాన్ ఇన్నింగ్స్ ముగిసింది. తిలక్ వర్మ (10 బంతుల్లో 12; 2 ఫోర్లు) ఎక్కువసేపు క్రీజులో నిలువలేకపోయాడు. ఈ దశలో సూర్య, రింకూ జతకలిసి ఐదో వికెట్‌కు 40 పరుగులు జోడించడంతో భారత్ 194/4తో విజయానికి చేరువైంది. అయితే ఇదే స్కోరు వద్ద సూర్య అవుటయ్యాడు. అప్పటికి భారత్ విజయానికి చేరువైంది.

చివరి ఓవర్ డ్రామా...

12 బంతుల్లో 14 పరుగులు చేయాల్సిన దశలో 19వ ఓవర్లో భారత్ 7 పరుగులు చేసింది. దాంతో చివరి ఓవర్లో భారత్ గెలుపునకు 6 బంతుల్లో 7 పరుగులు అవసరమయ్యాయి. తొలి బంతికే రింకూ ఫోర్ కొట్టాడు. రెండో బంతికి 'బై' రూపంలో పరుగు వచ్చింది. 4 బంతుల్లో 2 పరుగులు చేయాల్సిన దశలో భారత్ వరుసగా మూడు బంతుల్లో అక్షర్ పటేల్, రవి బిష్ణోయ్, అర్ష్‌దీప్ వికెట్లను కోల్పోయింది. రెండో పరుగు పూర్తి చేసే క్రమంలో అర్ష్‌దీప్ అవుటయ్యాడు. దాంతో చివరి బంతికి భారత్ విజయానికి ఒక పరుగు అవసరమైంది. 'సూపర్ ఓవర్' అవసరం పడుతుందా అనే అనుమానం కలిగిన దశలో అబాట్ వేసిన ఆఖరి బంతిని రింకూ సిక్స్‌గా మలచడంతో భారత్ విజయం ఖరారైంది. అయితే అబాట్ బంతి నోబాల్ అని తేలడంతో రింకూ సిక్స్ షాట్‌ను పరిగణనలోకి తీసుకోలేదు.


ఇషాన్

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: స్టీవ్ స్మిత్ (రనౌట్) 52; మాథ్యూ షార్ట్ (బి) రవి బిష్ణోయ్ 13; జోష్ ఇన్‌గ్లిస్ (సి) యశస్వి జైస్వాల్ (బి) ప్రసిధ్ కృష్ణ 110; స్టొయినిస్ (నాటౌట్) 7; టిమ్ డేవిడ్ (నాటౌట్) 19; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (20 ఓవర్లలో 3 వికెట్లకు) 208. వికెట్ల పతనం: 1–31, 2–161, 3–180. బౌలింగ్:** అర్ష్‌దీప్ సింగ్ 4–0–41–0, ప్రసిధ్ కృష్ణ 4–0–50–1, అక్షర్ పటేల్ 4–0–32–0, రవి బిష్ణోయ్ 4–0–54–1, ముకేశ్ కుమార్ 4–0–29–0.

భారత్ ఇన్నింగ్స్: యశస్వి జైస్వాల్ (సి) స్మిత్ (బి) షార్ట్ 21; రుతురాజ్ గైక్వాడ్ (రనౌట్) 0; ఇషాన్ కిషన్ (సి) షార్ట్ (బి) తన్వీర్ 58; సూర్యకుమార్ యాదవ్ (సి) ఆరన్ హార్డి (బి) బెహ్రన్‌డార్ఫ్ 80; తిలక్ వర్మ (సి) స్టొయినిస్ (బి) తన్వీర్ సంఘా 12; రింకూ సింగ్ (నాటౌట్) 22; అక్షర్ పటేల్ (సి అండ్ బి) సీన్ అబాట్ 2; రవి బిష్ణోయ్ (రనౌట్) 0; అర్ష్‌దీప్ సింగ్ (రనౌట్) 0; ముకేశ్ కుమార్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 14; **మొత్తం (19.5 ఓవర్లలో 8 వికెట్లకు) 209. వికెట్ల పతనం:** 1–11, 2–22, 3–134, 4–154, 5–194, 6–207, 7–207, 8–208. **బౌలింగ్:** స్టొయినిస్ 3–0–36–0, బెహ్రన్‌డార్ఫ్ 4–1–25–1, షార్ట్ 1–0–13–1, సీన్ అబాట్ 3.5–0–43–1, నాథన్ ఎలిస్ 4–0–44–0, తన్వీర్ సంఘా 4–0–47–2.

సామ్యూల్స్‌పై ఆరేళ్ల నిషేధం



దుబాయ్: అవినీతి నిరోధక నియమావళిని ఉల్లంఘించినందుకు వెస్టిండీస్ మాజీ క్రికెటర్ మార్లోన్ సామ్యూల్స్‌పై అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) ఆరేళ్ల నిషేధం విధించింది. 2019లో అబుదాబిలో జరిగిన టి10 లీగ్ సందర్భంగా సామ్యూల్స్ గుర్తుతెలియని వ్యక్తుల నుంచి లబ్ధి పొందాడని... ఎన్నిసార్లు అతడిని విచారించినా వాటికి సంబంధించిన వివరాలు ఇవ్వకపోవడంతో నిషేధం విధిస్తున్నట్లు ఐసీసీ తెలిపింది. 42 ఏళ్ల సామ్యూల్స్ 2012, 2016లలో టి20 ప్రపంచకప్ సాధించిన వెస్టిండీస్ జట్టులో కీలక సభ్యుడిగా వ్యవహరించాడు. 2008లో మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడటంతో రెండేళ్ల నిషేధానికి గురైన సామ్యూల్స్ వెస్టిండీస్ తరఫున 71 టెస్టులు (3917 పరుగులు; 41 వికెట్లు), 207 వన్డేలు (5606 పరుగులు; 89 వికెట్లు), 67 టి20 మ్యాచ్‌లు (1611 పరుగులు; 22 వికెట్లు) ఆడాడు.

హైదరాబాద్ బోణీ


రాహుల్

జైపూర్: విజయ్ హజారే ట్రోఫీ దేశవాళీ వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ జట్టు శుభారంభం చేసింది. మణిపూర్ జట్టుతో జరిగిన గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ ఐదు వికెట్ల తేడాతో గెలిచింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన మణిపూర్ సరిగ్గా 50 ఓవర్లలో 203 పరుగులకు ఆలౌటైంది. హైదరాబాద్ బౌలర్లలో రవితేజ (3/71), రక్షణ్ రెడ్డి (2/28), తనయ్ త్యాగరాజన్ (2/24) రాణించారు. అనంతరం హైదరాబాద్ కేవలం 29.5 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 208 పరుగులు చేసి నెగ్గింది. హైదరాబాద్ కెప్టెన్ గాహ్లౌత్ రాహుల్ సింగ్ (47 బంతుల్లో 70; 13 ఫోర్లు), చందన్ సహని (32 బంతుల్లో 41; 4 ఫోర్లు, 1 సిక్స్), రవితేజ (11 బంతుల్లో 23 నాటౌట్; 1 ఫోర్, 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడారు.

ఆంధ్ర పరాజయం

మరోవైపు చండీగఢ్‌లో ఆంధ్ర జట్టు పరాజయంతో ఈ టోర్నీని ప్రారంభించింది. గ్రూప్ 'డి'లో భాగంగా హిమాచల్ ప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు ఏడు వికెట్ల తేడాతో ఓడిపోయింది. ముందుగా ఆంధ్ర జట్టు 47.3 ఓవర్లలో 206 పరుగులకు ఆలౌటైంది. నితీశ్ రెడ్డి (59 బంతుల్లో 47; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), మనీశ్ గోలమారు (60 బంతుల్లో 46; 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. అనంతరం హిమాచల్ ప్రదేశ్ 43.3 ఓవర్లలో 3 వికెట్లకు 212 పరుగులు చేసి విజయం సాధించింది. అమిత్ (78 నాటౌట్; 11 ఫోర్లు), ఆకాశ్ వశిష్ట (53; 2 ఫోర్లు) అర్ధ సెంచరీలు సాధించారు.